ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 329 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 7 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

## కొత్తగా 10,950 విలేజ్ లెవల్ ఆఫీసర్ పోస్టులు



### 6 గంటలుగా కొనసాగిన కేబినెట్ సమావేశం

- ఎస్సీ కులాల వర్గీకరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం
- ఈనెల 12 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- 27 వరకు కొనసాగనున్న సమావేశాలు
- ఉగాది నుంచి భూభారతి అమలు చేయాలని నిర్ణయం
- ఫ్యూచర్ సిటీ కోసం కొత్త బోర్డు ఏర్పాటు

**హైదరాబాద్, మార్చి 6 (ప్రభాత ఉదయం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. బలహీన వర్గాలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన ముసాయిదా బిల్లుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే, విద్యా, ఉద్యోగ రంగాల్లో కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మంత్రిమండలి తీర్మానించింది. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ సిఫారసులను మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. దీనిపై శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టాలని తీర్మానించింది. డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సుదీర్ఘంగా జరిగిన మంత్రిమండలి సమావేశం పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు చేసింది. తెలంగాణలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) వివరాలు నమోదు చేసుకోవడానికి రెండోసారి ఇచ్చిన గడువు పూర్తయిన నేపథ్యంలో ఆ వివరాల ఆధారంగా మంత్రిమండలి నిర్ణయాలు తీసుకుంది. ఎస్సీ వర్గీకరణపై ..మిగతా 2లో



### ఎమ్మెల్సీల విజయం కాంగ్రెస్‌కు

# చెంప పెట్టు

**రేవంత్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు**
**తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు ఖాయం**
**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 6 (ప్రభాత ఉదయం):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించి అఖండ విజయాన్ని కట్టబెట్టిన తెలంగాణ సమాజానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు . బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ విజయం తెలంగాణ సమాజానికి, ఉపాధ్యాయులకు అంకితం ఇస్తున్నామని అన్నారు.రెండు ఎమ్మెల్సీలు ఏక కాలంలో రావడం చాలా సంతోషం. గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీని ఆదరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ తో సమానంగా తెలంగాణ సమాజం బీజేపీకి ఎంపీ సీట్లు కట్టబెట్టింది . మూడు స్థానాల్లో రెండు కీలకమైనవి. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంలో బీజేపీని గెలిపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేశాయని గ్రహించే రాష్ట్ర ప్రజలు బీజేపీని గెలిపించారని కిషన్ రెడ్డి అన్నారు. రెండు ఎమ్మెల్సీల విజయంతో బీజేపీ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి బీజేపీపైన అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన రెండు ఎన్నికల్లో బీజేపీని గెలిపించారని ..మిగతా 2లో

### అమెరికా సుంకాలపై

# అధ్యయనం చేస్తున్నాం




**బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా చర్చ చేస్తున్నాం**
**బాధ్యతగా ఏపికి సహకారం అందిస్తున్నాం**
**మీడియాతో కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్**

**విశాఖపట్నం, మార్చి 6 (ప్రభాత ఉదయం):** భారత్‌పై అమెరికా సుంకాల మోతపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. సుంకాల విషయమై చర్చలకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లారని తెలిపారు. అమెరికా వాణిజ్య మంత్రులతో ఆయన చర్చలు జరుపుతున్నారని ..మిగతా 2లో

# కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ బీఆర్ఎస్ కుట్ర




**ఈ రెండు పార్టీల మధ్య**
**లోపాయకారి ఒప్పందం.. మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మార్చి 6 (ప్రభాత ఉదయం):** ఎమ్మెల్సీ కాంగ్రెస్‌ను ఓడించేందుకు బిజెపి, బిఆర్ఎస్ కుట్ర చేసిందని తెలంగాణ ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ఎమ్మెల్సి ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై గాంధీభవన్ లోఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసి రంజాన్ గిఫ్ట్ ఇచ్చాయా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కలిసి పని చేశాయని బిఆర్ఎస్ బలం అంతా పెట్టి బిజెపికి సపోర్ట్ చేసిందని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని ఆ రెండు పార్టీలు కలిసి ఓడించాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి రంజాన్ గిఫ్ట్ ఇచ్చామని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చానన్నారు. తాము బిజెపికి ఎన్నో గిఫ్టులు ఇచ్చామని, త్వరలోనే రిటర్న్ గిఫ్ట్ ..మిగతా 2లో



# జానారెడ్డి ఇంటికి సీఎం రేవంత్

**జానారెడ్డికి కీలక పదవి దక్కనున్నట్లు సమాచారం**

2

### ఎమ్మెల్సీ చాంపియన్ ట్రోఫీ

# బీజేపీదే: బండి సంజయ్

**ఇకపై ఏ ఎలక్షన్ జరిగినా బీజేపీదే గెలుపని ధీమా**



**కరీంనగర్ మార్చి 6 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల చాంపియన్ ట్రోఫీలో బీజేపీ విజయం సాధించిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు గుణపాఠమని పేర్కొన్నారు. ముస్లింలంతా ఏకమై బీజేపీని ఓడించాలని చూస్తే, హిందూ సమాజమంతా కాంగ్రెస్‌ను ఓడించి ఆ పార్టీకి రంజాన్ గిఫ్ట్ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ ..మిగతా 2లో



# జానారెడ్డి ఇంటికి సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 6 (ప్రభాత ఉదయం): మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియత్ నేత జానారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆయన్ను ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా నియమించనున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈ మేరకు ఈ మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి అత్యవసరంగా మాజీ మంత్రి నివాసానికి వెళ్లడంతో ఈ వార్తలు గుప్పుమంటున్నాయి. కేబినెట్ భేటీకి ముందు సీఎం రేవంత్‌రెడ్డి జానారెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని శాలువా, ఫ్లవర్ బొకేతో మాజీ మంత్రి సత్కరించారు. అయితే, ప్రభుత్వం అడిగితే సలహాలు ఇస్తానని నిన్న జానారెడ్డి అన్నారు. దీంతో జానారెడ్డికి ప్రభుత్వ ముఖ్య సలహాదారు పోస్టు ముఖ్యమంత్రి ఆఫర్ చేసినట్లు సమాచారం. గతంలో అనేక శాఖలకు మంత్రిగా పని చేసిన అనుభవం, పట్టుఉన్న జానారెడ్డితో సీఎం ఏం చర్చించారనేది ఆసక్తిగా మారింది. కాగా, జానారెడ్డి కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. తన ఇద్దరు కుమారులు చట్టసభలకు ఎన్నికయ్యారు. రఘువీర్‌రెడ్డి నల్లగొండ ఎంపీగా, జయవీర్‌రెడ్డి నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా గెలిచారు. త్వరలో జరగబోయే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీపై కూడా వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. నల్గొండ జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత పేరు ఎమ్మెల్సీ పదవికి జానారెడ్డి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. జానారెడ్డిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపణలు చేస్తున్న క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి అత్యవసరంగా ఆయన నివాసానికి వెళ్లడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది.



## ఎమ్మెల్సీల విజయం కాంగ్రెస్‌కు చెంప పెట్టు

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టారని కిషన్ రెడ్డి అన్నారు. శాసన మండలి, సభలో ప్రజల సమస్యలపైన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం అన్నారు. శాసన మండలి, సభలో తెలంగాణ ప్రజల గుండె చప్పుడు వినిపిస్తాం. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉంది. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలనకు రెఫరండమని తాము అనడం లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఇప్పటివరకైనా నెరవేర్చాలని గుర్తు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ గిఫ్ట్ మాకు అవసరం మాకు లేదు.. రాహుల్ గాంధీకి ఇచ్చుకోండి. తెలంగాణ ప్రజలు మాకు గిఫ్ట్ ఇస్తున్నారు.. ఇస్తారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని కిషన్ రెడ్డి కాంగ్రెస్‌ను విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గాలి మాటలకు సమాధానం చెప్పాలా అని షన్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం గాలి మాటలకు సమాధానం, సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి నాపై ఇష్టమొచ్చి నట్లు మాట్లాడారు. ఆ ఆరోపణలకు ప్రజలే సరైన సమాధానం ఇచ్చారు. ప్రజా తీర్పు.. కాంగ్రెస్ పాలనకు చెంపపెట్టులాంటి దన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, యువతకు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, దళితులకు రూ.12 లక్షలు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని ఆ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నాం. జీవో 317 కారణంగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన ఇద్దరు ఎమ్మెల్సీలను కిషన్ రెడ్డి అభినందించారు.

## కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ బీఆర్ఎస్ కుట్ర

మొదటి పేజీ తరువాయి...



ఇస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లడుతూ.. కాంగ్రెస్‌ను ఓడించడానికి భాజపా, భారాస కలిసి పనిచేశాయన్నారు. పట్టభద్రులకు నైపుణ్యాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా, భారాస రెండూ కలిసే కాంగ్రెస్‌ను ఓడించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఫలితాలపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'అభ్యర్థిని పెట్టకుండా భాజపాతో కలిసి భారాస కుమ్మక్కయ్యిందని అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకటే అని తేలిందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారిద్దరు ఎవరికి ఓటేశారో చెప్పాలి. తక్కువ ఓట్లతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఈ ఓటమిపై సమీక్షించుకుంటామని అన్నారు. ఇదిలావుంటే అంబర్‌పేటలో తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. నియోజకవర్గంలో బాగ్ అంబర్‌పేట, నల్లకుంట, బర్కత్‌పురా ప్రాంతాల్లో రూ.4.90 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపి కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, అంబర్ పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రోహిన్ రెడ్డి పలువురు నేతలు, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడారు?బిఆర్ఎస్ పాలనలో రాష్టంలో ఆర్థిక విధ్వసం జరిగిందని అన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకరించట్లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు కిషన్ రెడ్డి అడ్డొస్తున్నారని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి...

వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణలోకి తీసుకుని మరోసారి అధ్యయనం చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఎస్సీ వర్గీకరణపై భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండే విధంగా శాసనసభ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రతిష్టాత్మకమైన ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి ఆమోదం. శ్రీశైలం హైవే - నాగార్జునసాగర్ హైవే మధ్య ప్రాంతంలో ఓఆర్ఆర్ వెలుపలి నుంచి ఆర్ఆర్ఆర్ బయట 2 కిలోమీటర్ల ప్రాంతం వరకు దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ విస్తరించి ఉంటుంది. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 36 గ్రామాలను ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కిందకు బదిలీ చేస్తూ తీర్మానించారు. ఫ్యూచర్ సిటీ మొత్తంగా 7 మండలాలు, 56 గ్రామాలతో విస్తరించి ఉంటుంది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా 90 పోస్టులను మంజూరు చేస్తూ ఆమోదించింది. హెచ్ఎండీఏ పరిధిని విస్తరించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఆర్ఆర్ఆర్ అవతల 2 కిలోమీటర్ల వరకు హెచ్ఎండీఏను విస్తరించారు. 11 జిల్లాల్లో 104 మండలాల్లో 1355 గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తాయి.

### కీలక బిల్లుకు ఆమోదం తెలిపిన తెలంగాణ కేబినెట్

మహిళా సాధికారతకు పట్టం కడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి మిషన్ -2025కు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామాల్లో సెర్ప్ కింద, పట్టణాల్లో మెప్మా కింద



ఉన్న మహిళా సంఘాలు ఇకనుంచి ఒకే గొడుకు కింద తెస్తూ తీర్మానం. మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వానికి కనీస వయసును 18 ఏండ్ల నుంచి 15 ఏండ్లకు కుదింపు. అలాగే సంఘాల్లో కొనసాగడానికి గరిష్ట వయసును 60 ఏండ్ల నుంచి 65 ఏండ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

### టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట బోర్డ్

తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుకు వీలుగా దేవాదాయ చట్టంలో సవరణలు చేయనున్నారు. 2025 - 2030 మధ్య ఐదేళ్లకు గాను టూరిజం పాలసీకి ఆమోదం. రాష్ట్రంలో గుర్తించిన 27 ప్రాంతాలను ప్రత్యేక టూరిస్టు కేంద్రాలుగా తీర్చిదిద్దడం. ఆ ప్రాంతాల అభివృద్ధి చేయడంలో 15 వేల కోట్లకు తగ్గకుండా పెట్టుబడులను రాబట్టేలా పాలసీ రూపకల్పన చేయనున్నారు.
మే నెలలో జరగబోయే మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి వచ్చే అతిథులకు ఏ లోటూ లేకుండా ఏర్పాట్లు. 2024 పారా ఒలింపిక్స్ విజేత దీప్తి జీవాంజికి ప్రభుత్వం ఉద్యోగ కల్పన. రెవెన్యూ గ్రామాలకు 10,954 గ్రామాలకు రెవెన్యూ అధికారుల నియమాకం. పెద్ద గోల్కొండ సమీపంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి 5 ఎకరాల భూమి కేటాయింపు. కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 361 పోస్టులకు అనుమతి. అలాగే, గురుకులాలకు మరో 330 పోస్టుల భర్తీకి అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని గంధమల్ల రిజర్వాయర్ కెపాసిటీని 4.28 టీఎంసీ నుంచి 1.28 టీఎంసీకి తగ్గించాలని నిర్ణయం. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సీనియర్ నాయకుడు కె.జానారెడ్డి నాయకత్వంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని తీర్మానం. పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరక్కుండా ఉద్దేశంతో అఖిల పక్ష సమావేశంలో చర్చించి అందరి అభిప్రాయాలను కేంద్రానికి నివేదించాలని నిర్ణయం తీసుకుంది తెలంగాణ కేబినెట్.

# అమెరికా సుంకాలపై అధ్యయనం చేస్తున్నాం

మొదటి పేజీ తరువాయి...

చెప్పారు. భారత్ ఎగుమతుల విషయాన్ని దృష్టిలో ఉంచుకుని చర్చలు ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలు, చార్టెడ్ అకౌంటెంట్స్, లాయర్లు, వ్యాపార సంఘాల నుంచి సలహాలు, సూచనలు తీసుకొని బడ్జెట్‌లో మార్పులు చేస్తామని స్పష్టం చేశారు. ఆర్థిక వేత్తలు, వివిధ వర్గాల మేధావులతో కేంద్ర బడ్జెట్‌పై విశాఖలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏపీకి కేంద్రంతో ముడిపడిన ప్రతి ప్రాజెక్టుకు ఎలాంటి లోటు లేకుండా చూస్తున్నట్టు పునరుద్ఘాటించారు. విశాఖ ఉక్కు పూర్వ వైభవానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. 'ఏటా బడ్జెట్ టేబుల్ చేశాక మధ్యలో గడువు ఉంటుంది. మళ్లీ పార్లమెంట్ మొదలయ్యాక ఫైనాన్స్ బిల్లుపై చర్చ జరుగుతుంది. ఆ తర్వాత ఆమోదం ఉంటుందన్నారు. ముఖ్యమైన అభిప్రాయాలు, సూచనలొస్తే సవరణలు చేసి బడ్జెట్‌ను ఆమోదిస్తాం. ప్రభుత్వ ఖర్చులతో రోడ్లు, ఆసుపత్రులు, విమానాశ్రయాలు నిర్మిస్తున్నాం. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఒక్కో ఇంటికి తాగునీరు అందిస్తున్నాం. మనం ఉపయోగించుకున్న వాటికే పన్ను చెల్లిస్తాం. కారు కొంటే దానిపైనే పన్ను చెల్లిస్తాం.. కొనని వారు చెల్లించరు. రోడ్డు వినియోగించుకున్న వారే టోల్ ట్యాక్స్ చెల్లిస్తారు. ప్రజలు పన్నులు చెల్లిస్తేనే రహదారులు నిర్మించగలిగేది' అని ఆర్థిక మంత్రి వివరించారు.కేంద్ర ప్రభుత్వంగా కాదు.. మా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందిస్తున్నాం అని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..అన్నారు.. బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత దేశ వ్యాప్తంగా చర్చలు నిర్వహిస్తున్నాం. మొదట ముంబైలో.. రెండో చర్చ
విశాఖ లో నిర్వహించాం అన్నారు.. విశాఖలో బ్జడెట్ పై వివిధ వర్గాల ప్రజలను కలసి వారి సలహాలు, సూచనలు తీసుకున్నాం అన్నారు.. ఇక, పోలవరం ప్రాజెక్ట్ కి అధిక ప్రాధాన్యత ఇచ్చాం.. కేంద్ర ప్రభుత్వంగా కాదు, మా బాధ్యతగా సహకారం అందిస్తున్నాం అన్నారు.. విశాఖ స్టీల్ ప్లాంట్ కు ఎక్కువ మొత్తం కేటాయించాం.. స్టీల్ ప్లాంట్ ను పునరాభివృద్ధి చేయడానికి 11 వేల కోట్ల సహకారం అందిస్తున్నాం.. పారిశ్రామిక కారిడార్ కు.. కేంద్ర ప్రభుత్వం నుంచి అమరావతి రాజధానికి కూడా సహకారం అందిస్తున్నాం. కేంద్రం, రాష్ట్రం కలిసి చేస్తున్న అన్ని ప్రాజెక్టులకు లోటు లేకుండా కేటాయింపులు చేస్తున్నాం అన్నారు. అయితే, సాంకేతిక సమస్యలు వలన పోలవరం ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుందన్నారు నిర్మలా సీతారామన్.. విభజన సమయంలో పోలవరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చాము. ఖచ్చితంగా పోలవరం ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తాం. అది జాతీయ ప్రాజెక్ట్ అని స్పష్టం చేశారు.. ఇక, 12 లక్షలు వరకు టాక్స్ కట్టే అవకాశం లేకుండా వెసులుబాటు ఇచ్చాము. సర్వీస్ సెక్టార్ లో నిర్దిష్టమైన ఆదాయం వస్తుంది. ఇతర దేశాలు తరహాలో మన దేశం అభివృద్ధి చెందాలి అంటే ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు.. మరోవైపు.. నేను పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో నివసించి అక్కడ నీటి కష్టాలు అనుభవించాను. జల్ జీవన్ మిషన్ ద్వారా నేరుగా ఇంటికి మంచినీరు ఇచ్చే బృహత్తర ప్రాజెక్టును చేపడుతున్నాము. ఆత్మ నిర్బర్ భారత్, మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాలు చేపట్టకపోతే వినాయక చవితికి విగ్రహం తయారుచేసే మట్టిని కూడా ఇతర దేశాలు నుంచి తెచ్చుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.. విశాఖకు సమీపంలో ఫార్మా రంగం అభివృద్ధికి బల్క్ డ్రాగ్ పరిశ్రమలు విస్తృత పరిచామని వెల్లడించారు..
ఖీ।జీట ంబెనీ: ÷తిసబీపజ్జీ÷జీ: శ్రీవారి భక్తులకు శుభవార్త.. అన్నప్రసాదం మెనూలో అదనంగా చేరిన గారె..
మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో సుంకాలు పెరిగే అవకాశం ఉందన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లి అక్కడ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారు. అమెరికా సుంకాల పెంపు ప్రభావం మన దేశ ఆర్థిక స్థితి మీద పడుతుందన్నారు.. నూతన పద్ధతులు ద్వారా ఆదాయపను చెల్లింపు విధానం అనేది పన్ను చెల్లింపుదారులకు సులభతరమైన మార్గంగా చేశామని తెలిపారు.. మూడు కోట్ల మంది మాత్రమే పన్ను చెల్లిస్తున్నారు.. కొత్త పన్ను వెసులుబాటు ద్వారా ఈ సంఖ్య మరింత తగ్గుతుందని ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

# ఎమ్మెల్సీ చాంపియన్ ట్రోఫీ బీజేపీదే: బండి సంజయ్



మొదటి పేజీ తరువాయి...

ఎలక్షన్స్‌లో గెలిచేందుకు నోట్లు పంచిన వారిని వదిలిపెట్టబోమని, గూగుల్ పే వివరాల లెక్కలు తీస్తున్నామని హెచ్చరించారు. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, తదితరులతో కలిసి బండి సంజయ్ సంబురాలు జరుపుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇది నాలుగో విజయమని, 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలతో పాటు నిన్న టీచర్స్ ఎమ్మెల్సీ, ఇయాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు సాధించామని తెలిపారు.

### బీఆర్ఎస్ మద్దతివ్వడంతోనే మూడోస్థానానికి హరికృష్ణ

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నోట్ల సంచులు ఓడిపోయాయని, ఓటర్లే గెలిచారని బండి సంజయ్ అన్నారు. ఈవీఎంలను మేనేజ్ చేసి బీజేపీ గెలుస్తున్నదని పదేపదే దుష్ప్రచారం చేసిన రాహుల్ గాంధీని నేను ప్రశ్నిస్తున్నా, ఈవీఎంల ద్వారా మాత్రమే కాదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్వహించిన బ్యాలెట్ పేపర్ ద్వారా బీజేపీయే గెలిచింది. దీనికేం సమాధానం చెబుతారని అన్నారు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ రెండో స్థానంలో ఉంటారని తాము భావించామని చెప్పారు. అయితే బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆయనకు మద్దతివ్వడంతో గ్రాడ్యుయేట్లు ఆయనను మూడోస్థానానికి పరిమితం చేశారని అన్నారు.



# రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి6(ప్రభాత ఉదయం)రైతులు సాగు చేసుకుంటున్న పంటల వివరాలను అధికారుల వద్ద తప్పక నమోదు చేసుకోవాలని కేటిదొడ్డి మండల వ్యవసాయ అధికారి సాజిద్ రెహ్మాన్ అన్నారు. గ్రామాల్లో యాసంగి పంటల సాగు నమోదు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం మండల పరిధిలోని కొండాపురం, గంగన్ పల్లి, వెంకటాపురం, కేటిదొడ్డి తదితర గ్రామాలలోని వేరుశనగ, వరి పంటలను ఏఈఓలు పరిశీలించారు. అనంతరం భూనక్షా మ్యాప్‌ను ద్వారా ఆన్ లైన్ లో రైతు పేరు, విస్తీర్ణం, ఆధార్ కార్డు, గ్రామం, గతంలో సాగు, ప్రస్తుతం సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏఈఓలు మాట్లాడుతూ రైతులు యాసంగిలో సాగు చేసే పంటలు వరి,వేరుశనగ, కూరగాయలు తదితర పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.



# ఎమ్మెల్సీ కావాలని అడగబోను

## కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, మార్చి 6 (ప్రభాత ఉదయం): తాను ఎమ్మెల్సీ అడగటం లేదని, తాను అడగనని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ నేత జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కావాలని దేబురించే పరిస్థితి తనకు లేదన్నారు. తనకు పార్టీ ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇచ్చిందని, పోటీ చేసినా పరిస్థితులు అనుకూలించక ఓడిపోయాయని, మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నానని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ పదవి కావాలని పదేపదే అడిగే గుణం తనది కాదని ఆయన తెలిపారు. గురువారం ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈ విషయంలో మీడియా మిత్రులు ఎవరూ కూడా ఎమ్మెల్సీ విషయంలో ఊహాగానాల వార్తలు రాయొద్దని ఆయన సూచించారు. 2017 లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభ ఏర్పాట్ల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లాలని, ఆరు నెలల నుంచి ఢిల్లీకి వెళ్లి రాహుల్‌కు చెప్పాలని అనుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ సభ ఏర్పాట్లు, ఎలాంటి పరిస్థితుల్లో ఆ సభ ఏర్పాట్లు చేశానో రాహుల్‌కు స్వయంగా చెప్పాలని ఢిల్లీకి వెళు తున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీకి వెళ్లిన తర్వాత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరికితే ఆయనతో మాట్లాడుతానని ఆయన స్పష్టం చేశారు.

# మధుబన్ కాలనీలో ప్రజలకు ఉపయోగపడే పార్కు నిర్మాణానికి సహకరించండి



మధుబన్ కాలనీ లోని పార్కు స్థలం



పార్కు స్థలం చుట్టు ఫెన్సింగ్ వేయవద్దంటున్న హెచ్ ఎం డీ ఏ సిబ్బంది




మధుబన్ కాలనీలో గల పార్కు స్థలంకు సంబంధించిన లే అవుట్ మ్యాప్

కాటేదాన్, మార్చి6(ప్రభాత ఉదయం) : మధుబన్ కాలనీలో పార్కు స్థలం తో పాటు దాని పక్కనే హెచ్ఎండీఏ కు సంబందించిన కొంత ఖాళీ స్థలం ఉండటంతో ఆ స్థలాన్ని కాలనీకి పార్కుగా ఏర్పాటు చేసుకోవడానికి స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి రూ. 13లక్షలను మంజూరు చేయించుకున్నారు. ఆ నిధులతో పార్కు స్థలంతో పాటు ఖాళీగా ఉన్న స్థలం చుట్టూరా పెన్సింగ్ వేయడానికి పనులు ప్రారంభించారు. చాలా వరకు బేస్మిట్ పనులు పూర్తయ్యాయి. ఆ నులను గురువారం హెచ్ఎండీఏ అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్ క్రాంతి అడ్డుకున్నాడు. దీంతో కాలనీ వాసులు మేము ప్రజలందరికి ఉపయోగపడేవిధంగా పార్కు కోసం ఫెన్సింగ్ వేస్తున్నామని అన్నారు. ఫెన్సింగ్ వేయకపోతే ఆ స్థలం కూడా కబ్జాకు గురౌతుందని వాపోయారు. ఇప్పటికే ఓపెన్ ప్లాట్ లోకి పక్కనే ఉండేవారు గేటు పెట్టి వాడుకుంటున్నారన్నారు . చాలా స్థలాలు అన్యాక్రాంతమై పోయాయని వాటిని గురించి పట్టించుకోని అధికారులు పార్కును అడ్డుకోవడం బాధాకరమన్నారు. కాలనీలో ప్రధాన రహదారులలో ఖాళీగా ఉన్న స్థలాలలో డబ్బాలు, దుకాణాలు ఏర్పాటు చేసుకుని అద్దెకు ఇస్తుంటే అధికారులు ఎందుకు వారిని ప్రశ్నించడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రజలందరికోసం ఉపయోగపడే పార్కు నిర్మాణానికి సహకరించాలని, హెచ్ఎండీఏ ఖాళీ స్థలాన్ని కూడా పార్కుకు కేటాయించాలని కోరుతున్నారు.

**హెచ్ఎండీఏ అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీషర్ క్రాంతి వివరణ :**

పార్కు స్థలం చుట్టూరా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. హెచ్ఎండీఏ కు చెందిన ఓపెన్ స్థలం మాత్రం ఖాళీగా ఉంచాలి. మేం త్వరలోనే ఆ స్థలం లో ఫెన్సింగ్ లేదా ప్రహరీ నిర్మాణం చేస్తాం. మా స్థలం వైపు గేటు పెట్టిన వారి గేటును కూడా కూల్చేస్తాం.



సంగమిత్ర - వెంకటేశ్‌లను ఆశీర్వదిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

## ఘనంగా సంగమిత్ర-వెంకటేశ్‌ల వివాహా వేడుక

బుద్వేల్, మార్చి 6(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ సాయికృష్ణ కాలనీ వాస్తవ్యులు, రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో కంట్రోలర్ గా పనిచేస్తున్న మేడిబాయి అనంతయ్య - మేడి బాయి అరుణ ల కుమార్తె సంగమిత్ర వివాహాము. .. వట్టి కోటి అలివేలు - వట్టికోటి సత్తయ్య ల కుమారుడు వెంకటేష్ తో గురువారం ఘనంగా జరిగింది. ఉప్పర్ పల్లి ఎస్ పి ఆర్ గార్డెన్స్ లో జరిగిన వివాహ వేడుకలకు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో సిబ్బంది , సాయి కృష్ణ కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వదూవరులను ఆశీర్వదించారు.



అవగాహన ఒప్పందం పత్రాలను మార్చుకుంటున్న అదికారులు

## నార్మ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం

బుద్వేల్, మార్చి6(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇటీవల నెలకొల్పిన మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి సాంకేతిక సహకారం అందించడం కోసం రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ అఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్(నార్మ్) తో గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది . ఈ అవగాహన ఒప్పంద పత్రాలపై నార్మ్ కు చెందిన ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ ఆర్.సి అగర్వాల్, వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ లు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య సమక్షంలో సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం వచ్చే మూడు సంవత్సరాలలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు, సిబ్బందికి నూతన అంశాలు. వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై నార్మ్ సహకారంతో శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ అల్దాస్ జానయ్య తెలిపారు. నార్మ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ సి ఆగర్వాల్ మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి తాము ఎప్పుడు కటుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అదికారులు డాక్టర్ బలరాం, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ వి.రాములు, నార్మ్ అధికారులు పాల్గొన్నారు.



సోను

## ప్రేమించిన యువతి తనతో మాట్లాడటం లేదని ఫ్లోర్ క్లీనర్‌ను త్రాగిన యువకుడు

బుద్వేల్ మార్చి6(ప్రభాత ఉదయం) : తాను ఇష్టపడ్డ యువతి తనతో మాట్లాడటం లేదనే బాధతో ఆ యువతి ఇంటి వద్దకు వచ్చిన యువకుడు గురువారం ఫ్లోర్ క్లీనర్ కోసం ఉపయోగించే ద్రవాన్ని తాగాడు. గమనించిన స్థానికులు 100 కు డయల్ చేశారు. మైలార్దేవుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని 108 ని పిలిపించి ఆ యువకునికి ప్రదమ చికిత్స చేయించారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... బాగలింగంపల్లి కి చెందిన సోను (21) డిగ్రీ చదువుతున్నాడు. అతనికి మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే 21 సంవత్సరాల యువతి తో పరిచయం ఉంది. ఒకరినొకరు ప్రేమించుకున్నారు. స్నేహితురాలు ఫోటోను సోను తన చాతిపై టాటు కూడా వేయించుకున్నాడు. కొన్నాళ్లుగా ఆ యువతి సోను తో మాట్లాడటం లేదు. సోను గురువారు ఆ యువతి ఇంటి దగ్గరకు వచ్చి మాట్లాడటానికి ప్రయత్నించాడు. అయినా ఆ యువతి మాట్లాడకపోవడంతో తన మెట తెచ్చుకున్న ఫ్లోర్ క్లీనర్ ద్రవాన్ని త్రాగాడు. గమనించిన స్థానికులు 100 కు డయల్ చేశారు. మైలార్ దేవుపల్లి ఎస్ఐ పైడి నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని 108 కి కాల్ చేసి సోను కు ప్రదమ చికిత్స జరిపించారు. యువతి ఫిర్యాదు మేరకు సోను పై కేసు నమోదు చేశారు. సోను అన్న రోహిత్ ను పిలిపించి అతన్ని అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.






*వేసవి కాలంలో రాజేంద్రనగర్ సర్కిల్ దుర్గానగర్, లక్ష్మీగూడ రోడ్లలో ఉన్న చెట్లకు పూసిన పసుపు పచ్చ, లైట్ పింక్ కలర్ పూలు జిగేల్ మనిపిస్తున్నాయి. చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ వైపు వెళ్లే రహదారిలో రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న చెట్లకు పసుపు పచ్చని పూలు పూసి మిళమిళ మెరుస్తున్నట్లు కనిపిస్తున్నాయి. అదే సమయంలో మైలార్దేవుపల్లిలోని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాశ్ గౌడ్ ఇంటి ముందు నుంచి లక్ష్మీగూడ కు వెళ్లే దారిలో చెట్లకు పూసిన లైట్ పింక్ కలర్ పూలు మనస్సును ఆహ్లాద పరుస్తున్నాయి. వీటిని చూసిన బాటసారులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.*

## ఘనంగా డాక్టర్ ఫణి విజ్ఞాన్-డాక్టర్ స్నేహిక వివాహా మహెూత్సవం



ఫణి విజ్ఞాన్-స్నేహికలను ఆశీర్వదిస్తున్న గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు, శ్రేయోభిలాషులు



వదూవరులను ఆశీర్వదిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

బుద్వేల్, మార్చి 6 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవుపల్లి డివిజన్ టీఎన్జీవోస్ కాలనీ ని ఆనుకొని ఉన్న సాయి కాలనీ కి చెందిన జర్నలిస్టు సంఘం నాయకులు, శ్రీ సాయి గ్రామర్ హై స్కూల్ నిర్వాహకులు ఏ పి చారి- శ్రీలక్ష్మి ల కుమారులు డాక్టర్ ఫణి విజ్ఞాన్ వివాహం గురువారం శివరాంపల్లి వాస్తవ్యులు , రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు , శ్రీ గాయత్రీ హై స్కూల్ నిర్వాహకులు ఎం. ప్రభాకర్ చారి - లలిత ల కుమార్తె డాక్టర్ స్నేహిత తో ఘనంగా జరిగింది. శంషాబాద్ కశిష్ ప్యాలెస్ లో వివాహా వేడుకలు జరిగాయి. వివాహా వేడుకలకు ఇరు కుటుంబాల కు చెందిన బంధువులు , స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. నిశ్చితార్థ వేడుకలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, మైలార్దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తో పాటు రంగారెడ్డి జిల్లా కు చెందిన గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు, జర్నలిస్టులు, స్నేహితులు, బందువులు, శ్రేయోభలాషులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ లోని కలశాల వద్ద ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

## రాజేంద్రనగర్ మండలంలోని 14 పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

బుద్వేల్, మార్చి6(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ మండలంలో గురువారం ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని 14 కేంద్రాలలో 4, 658 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 4,534 మంది పరీక్షలకు హాజరైనారు. 124 మంది విద్యార్థులు గైరాహజరయ్యారు. పరీక్షా కేంద్రాలలో రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు సిట్టింగ్ స్క్వాడ్లుగా కూర్చున్నారు. జిల్లా ఎగ్జామినేషన్ సెంటర్ కు చెందిన అధికారులు మండల పరిధిలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలలో పరీక్షలు ఏ విదంగా జరుగుతున్నాయి.. ఏర్పాట్లు ఎలా ఉన్నాయనే వివరాలను సేకరించారు. రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంక్యా నాయక్, రాజేంద్రనగర్ మండల ఇంటర్మీడియెట్ పరీక్షల కస్టోడియన్లు మురళి, రామక్రిష్ణ, శేషాద్రీలు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ జాగ్రత్తలు తీసుకున్నారు.

**రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...**

రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 360 మంది విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం మొదటి పేపర్ పరీక్షా రాయాల్సి ఉండగా 13 మంది విద్యార్థులు గైరాహజరు అయ్యారు. 347 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇంటర్ పరీక్షలు రాజేంద్రనగర్ మండలంలో ప్రశాం తంగా జరిగాయి.



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

# మోనిష్ గౌడకు గోల్డ్ ప్రైజ్



గోల్డ్ ప్రైజును గెలుచుకున్న మోనిష్ గౌడ టి పి




బుద్వేల్, మార్చి 6(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) లో పీజీ డీ ఎం - ఏ బీఎం (పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్- అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్) ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మనీష్ గౌడ టి పి రూరల్ మార్కెటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుండి బంగారు అవార్డును గెలుచుకున్నాడు. అతను డీసీఎం శ్రీరామ్ లిమిటెడ్‌లో నిర్వహించిన "డ్రిప్ ఇరిగేషన్ మార్కెట్‌లో స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ ఉత్పత్తులపై మార్కెట్ సర్వే" అనే ప్రాజెక్టుకు గాను ఈ అవార్డు వరించింది. గ్రామీణ మార్కెటింగ్ మరియు వ్యవసాయ వ్యాపార రంగంలో అత్యుత్తమ ప్రాజెక్టులను సత్కరించడానికి ఆర్ ఎం ఏ ఐ ఇటీవల హైదరాబాద్‌లో ఈ ఫ్లేమ్ స్టూడెంట్ అవార్డులను నిర్వహించింది. ఈ అవార్డులో భాగంగా మోనిష్ గౌడ రూ. 50,000 నగదు అవార్డును కూడా అందుకున్నారు. ఈ ప్రాజెక్టును అవార్డు స్క్రీనింగ్ కమిటీ మూల్యాంకనం చేసింది, ఇందులో పరిశ్రమలోని ప్రముఖ వ్యక్తులు - భారతదేశంలో గ్రామీణ మార్కెటింగ్ పితామహుడిగా పిలువబడే ఆర్ ఎం ఐ - మార్ట్ గ్లోబల్ వ్యవస్థాపకుడు శ ప్రదీప్ కశ్యప్‌బీ ఐ టీ సీ లిమిటెడ్ అగ్రి %ఁ% ఐ టీ వ్యాపారాల గ్రూప్ హెడ్ శివకుమార్, ఎస్ సీడ్‌వర్క్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ డాక్టర్ వెంకట్రామ్ వసంతవాడ, మార్ట్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ సీఈఓ పంకజ్ మిశ్రాబీ కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్ అగ్రిబిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ శ్రీకాంత్ గంగిశెట్టి, జే కే లక్ష్మీ సిమెంట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) శ్రీ రాజన్ వర్మ, ఐ టీ సీ లిమిటెడ్ అగ్రి బిజినెస్ డివిజన్ జనరల్ మేనేజర్ నిశాంత్ సిన్హా, ఇన్‌సైట్ ఔట్రీచ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఖుర్రామ్ అస్కారి, ఉన్నారు.



## ప్రశాంతంగా కొనసాగుతున్న
# ఇంటర్మీడియట్ పరీక్షలు

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి6(ప్రభాత ఉదయం)ఇంటర్మీడియట్ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం సెకండ్‌లాంగ్వేజ్ పేపర్ కు పరీక్షలకు సెట్ ‘ ఎ’ ప్రశ్నా పత్రాన్ని ఎంపిక చేశారు. జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలలో మొత్తం 3,685 మంది విద్యార్థులకుగాను 3,583 విద్యార్థులు హాజరు కాగా 102 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులకు గ్రేస్ పీరియడ్ సమయం పెంచడం ఈ సారి కలిసి వచ్చింది. చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గంట ముందే ఎగ్జామ్ సెంటర్లకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అధికారులు లోపలికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు 144 సెక్షన్‌ను అమలు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు కేంద్రాల్లో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజ్ అకస్మికంగా తనిఖీలు చేపట్టారు.



గద్వాల్ మండల తాసిల్దార్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేస్తున్న సేవలాల్ సేన ప్రతినిధులు

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి
# స్థలం కేటాయించాలి
### సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మూడవత్ రవి నాయక్


గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి6(ప్రభాత ఉదయం)బంజారాల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ కమ్యూనిటి హాల్ ఏర్పాటుకు కొరకు స్థలాన్ని కేటాయించాలని సంత్ సేవాల్ సేన నాయకులు కోరారు. గురువారం గద్వాల తహసీల్దార్ మల్లికార్జున కు సేవాలాల్ సేన సంఘం నాయకులు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మూడవత్ రవి నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ నాయక్, కోశాధికారి సురేష్ నాయక్, ఉపాధ్యక్షులు ఎన్ రవినాయక్, మేఘనాథ్ నాయక్ , పుష్పరాజు నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి: సీఐటీయు

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి6(ప్రభాత ఉదయం) కార్మికులందరికీ కనీస వేతనం 26,000గా నిర్వహించి అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వివి నరసింహా డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సవరించాల్సిన జీవోలు 18 సంవత్సరాల కాలం గడిచిన సవరించడం లేదని దీనివల్ల కార్మిక వర్గం తీవ్ర శ్రమ దోపిడి కి గురవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు 1957 సంవత్సరంలో 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనాల నిర్ణయానికి ప్రాతిపదికగా ఉండాలని ప్రభుత్వం యాజమాన్యాలు కార్మిక సంఘాలు ఆమోదించాయని తెలిపారు రోజుకు కనీసం 2700 క్యాలరీల శక్తినిచ్చే ఆహారం కార్మికులు తీసుకోవాలని కనీస వేతనంలో కుటుంబం మూడు వినియోగ యూనిట్లకు అయ్యే ఆహారం ప్రతి యూనిట్ కు 18 గజల చొప్పున 72 గజాల దుస్తులు 10 శాతం ఇంటి అద్దె కనీస వేతనాలపై 20% ఇంధన విద్యుత్ ఖర్చులు కలిసి ఉండాలని వాటితో పాటు 1992 సుప్రీంకోర్టు తీర్పు రాప్ట కోస్ బ్రెట్ కేసులోని తీర్పు ప్రకారము పై ఖర్చులతో పాటు కరువు భత్యం కూడా ఇవ్వాలని సూచించారు కానీ ప్రభుత్వాలు ఏమి పట్టించుకోకుండా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం కార్మికుల పని గంటలు పెంచి రోజురోజుకు దోచుకు తింటున్నారని విమర్శించారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనాలు పెంచాల్సిన తరుణంలో జీవోల సవరణ పేరుతో వేతనాలు తగ్గించి మరింత మోసం చేస్తున్నారని విమర్శించారు సిఐటియు నాయకత్వం కార్మిక వర్గ సమస్యల పై ప్రశ్నిస్తుందనే నెపంతో కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియుకు ప్రాతినిధ్యం కల్పించకుండా విభజించు పాలించు అనే పక్షపాత ధోరణి ప్రదర్శించిందని విమర్శించారు కనుక కార్మిక వర్గం ఐక్యంగా ఉండి సంఘటిత పోరాటాల ద్వారా కనీస వేతనం 26 వేల రూపాయలు సాధించుకోనెంత వరకు పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ శారద శివమ్మ పుష్ప కురుమన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.


## నూతన వధూవరులు ప్రీతి రెడ్డి, భరత్ చంద్ర రెడ్డిలను ఆశీర్వదించిన
# సీఎం రేవంత్ రెడ్డి, ప్రముఖులు








శంషాబాద్, మార్చి6(ప్రభాత ఉదయం) దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి కూతురు ప్రీతి రెడ్డి ,భరత్ చంద్ర రెడ్డి ల వివాహ మహోత్సవం శంషాబాద్ లోని జీఎంఆర్ ఎరిన ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకల్లో నూతన వధూవరులు ప్రీతి రెడ్డి భరత్ చంద్ర రెడ్డి లను సీఎం రేవంత్ రెడ్డి తోపాటు పలువురు ప్రముఖులు హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి , క్రీడా వ్యవహారాల సలహాదారుడు , ఒలంపిక్ రాష్ట్ర అధ్యక్షులు



ఏపీ జితేందర్ రెడ్డి,నారాయణపేట లిశాసనసభ్యులు చిట్టెం పర్ణిక రెడ్డి ,నాయకులు శివకుమార్ రెడ్డి, మూలమల్ల భీమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు మూలమల్ల యుగంధర్ రెడ్డి,మాజీ ఎంపీపీ నాగార్జున రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రామన్ గౌడు, మాజీ సర్పంచ్ ఎద్దుల కృష్ణయ్య ,మాజీ ఎంపిటిసి జక్కుల నాగన్న , మాజీ కౌన్సిలర్ రాముల యాదవ్, మాజీ సి డి సి చైర్మన్ జగన్మోహన్ రెడ్డి లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.







## సీఎం రేవంత్ రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి
### కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన శేరి సతీష్ రెడ్డి



కూకట్‌పల్లి, మార్చి 6 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులను పెడుతున్న వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. గురువారం అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న బిఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి ఫోటోలు మార్ఫింగ్ చేసి వివిధ సోషల్ మాధ్యమాలు ద్వారా సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ అనుచరుడు చాంద్ పాషా అనే వ్యక్తి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సింది గా కెపిహెచ్బి సిఐ రాజశేఖర్ రెడ్డి కి కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు శేరి సతీష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సాధు ప్రతాపరెడ్డి, బి సంజీవ్ రావు, తూము వినయ్ కుమార్, ఓబీసీ సెల్ చైర్మన్ మేకల దేవ సాయం, రవి కొమ్ము, బాబురావు, రాజు ముదిరాజ్, పిడికిలి గోపాల్ చౌదరి, గిరినాయుడు, బచ్చుమల్లి తదితరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి6(ప్రభాత ఉదయం) ప్రభుత్వ కొలువును నిర్వహిస్తూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. సరైన విధంగా విధులు నిర్వహించకపోవడం తో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ధరూర్ మండలం పెద్దపాడు ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులు ఉదయం వేళల చాల ఆలస్యంగా హాజరవుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తుండగా.. ఒకరు సెలవులో ఉన్నారు. మరో ఉపాధ్యాయుడు పాఠశాలకు ఆలస్యంగా రావడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. అలాగే ధరూర్, కేటిదొడ్డి, గట్టు మండలాలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. ఉదయం ఎప్పుడు వస్తారో... సాయంత్రం ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అధికారుల తనిఖీలు లేకనే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. ఈ విషయమై మండల విద్యాధికారులను వివరణ కోరగా విచారణ చేసి తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని మిగతా పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదన్న ఆరోపణలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



# మక్తల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సిఐ రామ్‌లాల్

మక్తల్,మార్చి6(ప్రభాత ఉదయం) మక్తల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా రామ్ లాల్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట ఎస్ బి సిఐ గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై మక్తల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా రావడం జరిగింది. అనంతరం మక్తల్ సిఐ రామ్ లాల్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలు పరిరక్షిస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటమని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని సిఐ తెలిపారు.

# వ్యాపారి ఇంట్లో భారీ చోరీ



గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 6 (ప్రభాత ఉదయం) జిల్లా కేంద్రంలో పట్టపగలే ఓ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో దాచిపెట్టిన 7 తులాల బంగారం, 5.250 కేజీల వెండి ఆభరణాలు, రూ. 1,30,000 నగదు అపహ రించుకు పోయారు. గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి... రాజవీధిలో నివసిస్తున్న సంజీవ్ బంగారం షాపు నిర్వహిస్తున్నారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యానికి వెళ్లాడు. మద్యాహ్నం ఇంటికి రాగ ఇంటితాళాలు పగులగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా.. వస్తువులు కిందపడి ఉన్నాయి. ఇంట్లో దాచిన 7 తులాల బంగారం, 5.250 కేజీల వెండి ఆభరణాలు, రూ. 1,30,000 నగదు అపహరణకు గురి కావడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కళ్యాణ్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608